సాక్షి కామారెడ్డి
బుధవారం । 3 । జూలై । 2024



అండగా ఉంటాం
తమ ప్రభుత్వం అన్నదాతలకు అండగా ఉంటుందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పేర్కొన్నారు.
- 8లో ▸



జాబ్ క్యాలెండర్ ఇవ్వాలి
ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేశారు.
- 9లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
35.6 /24.3
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ ఓ మోస్తరునుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

'నాటిన మొక్కను అమ్మలా సంరక్షించుకోవాలి'



కామారెడ్డి టౌన్‌: ప్రతి బీజేపీ కార్యకర్త నాటిన మొక్కలను అమ్మలా కాపాడుకోవాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 'అమ్మ పేరిట ఒక మొక్క' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తన తల్లిదండ్రుల పేరిట మొక్కలను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి బీజేపీ కార్యకర్త అమ్మతో కలిసి ఒక మొక్క నాటి సోషల్‌ మీడియాలో పెట్టాలని కోరారు. ఆ మొక్క పెరిగి వృక్షంగా అయ్యే వరకు బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ నెల 6వ తేదీన శ్యామా ప్రసాద్‌ ముఖర్జీ జయంతి రోజున నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌ పాల్గొన్నారు.

'డిగ్రీ పరీక్షలలో అత్యుత్తమ ఫలితాలు సాధించాం'


హేమవంతిని

కామారెడ్డి అర్బన్‌: డిగ్రీ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్‌ పరీక్షలలో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపారని కామారెడ్డి ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ విజయ్‌కుమార్‌ తెలిపారు. ఈ విషయమై ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 8 పాఠ్యాంశాల్లో వంద శాతం, 24 పాఠ్యాంశాల్లో 80 శాతం ఉత్తీర్ణత సాధించామని పేర్కొన్నారు. బీఎస్సీ బీజెడ్‌సీలో చింతకింది హేమవంతిని 10 జీపీఏ సాధించగా, సయేదా హుదానాజ్‌ 9.76, ఫారెస్ట్రీ విద్యార్థి షేక్‌ నేహ 9.84 జీపీఏ, ఫిషరీస్‌లో ఎం.మహేశ్వరి 9.84, ఎస్‌.రఘు 9.80 జీపీఏ, బీఏలో ఎర్రోల్ల విష్ణు 9.76 జీపీఏ సాధించారని తెలిపారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో తెలంగాణ విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి అరుణ, అదనపు అధికారి శాంతాబాయి, కళాశాల అధికారి రామకృష్ణ, అదనపు అధికారులు రాములు, రామస్వామి పాల్గొన్నారు.

ఐదు వేల ఏళ్ల కిందటి నూరుడు గుంతల రాయి లభ్యం



సాక్షి, కామారెడ్డి: లింగాపూర్‌ గ్రామ శివారులో ఐదువేల ఏళ్ల కిందటి నవీన శిలా యుగంలో ఆది మానవుడు ఉపయోగించిన నూరుడు గుంతల రాయిని గుర్తించారు. ఈ విషయాన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృంద సభ్యుడు శ్రీకాంత్‌ మంచాల తెలిపారు. ఒకే రాయిపై అడుగు పొడవు, రెండు ఇంచ్‌ల వెడల్పు ఉన్న నూరుడు గుంతలు మూడు ఉన్నాయని పేర్కొన్నారు. ఆది మానవుడు జంతువులను వేటాడడం ఇతర అవసరాల కోసం రాతి గొడ్డళ్లను, రాతి పరికరాలను తయారు చేసుకోవడానికి ఈ రాయిపై పదేపదే నూరడం వల్ల ఏర్పడ్డవే ఈ గుంతలు అని తెలిపారు. ఈ రాయిని ఇక్కడి నుంచి తీసి సురక్షితమైన ప్రదేశంలో భద్రపరచాలని ప్రభుత్వాన్ని కోరారు.

'పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి'



కామారెడ్డి అర్బన్‌: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ వన్‌ టైమ్‌ చాన్స్‌ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని తెయూ అకడమిక్‌ సెల్‌ డైరెక్టర్‌ చంద్రశేఖర్‌ సూచించారు. జిల్లాకేంద్రంలోని ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. పరీక్షల్లో అవకతవకలు జరుగకుండా చూడాలన్నారు. నాయన వెంట కళాశాల వైస్‌ ప్రిన్సిపాల్‌ కిష్టయ్య, అకడమిక్‌ సెల్‌ సమన్వయకర్త శంకరయ్య, విశ్వ విద్యాలయం పరిశీలకులు శోభ, రాజేందర్‌ తదితరులున్నారు.



స్థానికం.. అంతా ప్రత్యేకం!

- ఇప్పటికే ప్రత్యేకాధికారుల చేతిలో పంచాయతీలు
- నేటితో మండల పరిషత్‌, రేపటితో జెడ్పీ పదవీకాలం ముగింపు
- ఇక గ్రామాల్లో 'స్థానిక' పాలనంతా ప్రత్యేకాధికారుల చేతుల్లోకి..

పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం ముగిసి ఐదు నెలలు దాటాయి. ఎన్నికలు నిర్వహించకపోవడంతో ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. ప్రస్తుతం మండల, జిల్లా పరిషత్‌లూ అదే దారిలో పయనిస్తున్నాయి. పదవీకాలం ముగింపునకు వచ్చినా ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఇక గ్రామీణ స్థానిక సంస్థలన్నీ ప్రత్యేకాధికారుల పాలన కిందకు రానున్నాయి.

సాక్షి, కామారెడ్డి : పల్లె పాలనలో 'స్థానిక' సంస్థలదే కీలక భూమిక. పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌ పాలక వర్గాలు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తాయి. ఇదే సమయంలో రాజకీయంగా ఎదగడానికి స్థానిక సంస్థలు నేతలకు నిచ్చెన మెట్లుగా ఉపయోగపడతాయి. అయితే పాలక వర్గాల పదవీ కాలం ముగియడానికన్నా ఆరు నెలల ముందుగానే ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేయాల్సిన ప్రభుత్వం.. ఆ విషయాన్ని పక్కన పెట్టేసింది. దీంతో ఇప్పటికే పంచాయతీలు ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లాయి. తాజాగా మండల, జిల్లా పరిషత్‌లు కూడా ప్రత్యేకాధికారుల పాలనలోకి వెళ్లనున్నాయి. మండల పరిషత్‌ పాలక వర్గాల పదవీ కాలం ఈ నెల 3న, జిల్లా పరిషత్‌ పాలక వర్గం పదవీ కాలం ఈనెల 4న ముగియనుంది. దీంతో మండల, జిల్లా పరిషత్‌లకు ప్రత్యేకాధికారులను నియమించే అవకాశాలున్నాయి.

పెదవి విరుపు

ఐదేళ్ల పదవీ కాలంలో సాధించేదేమీ లేదని మండల, జిల్లా పరిషత్‌ పాలక వర్గాలు నిట్టూరుస్తున్నాయి. పదవుల్లోకి వచ్చి అన్నీ తెలుసుకునేలోపే కరోనా మహమ్మారి దేశాన్ని అతలాకుతలం చేసింది. ఈ సమయంలో దాదాపు రెండేళ్ల పాటు ఏమీ చేయలేని పరిస్థితులు ఎదుర్కొన్నామని పలువురు ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నారు. ఇదే సమయంలో నిధుల కొరతతో అభివృద్ధి పనులు చేయలేకపోయామంటున్నారు. ఐదేళ్ల కాలంలో పెద్దగా సాధించేందేమీ లేదని పెదవి విరుస్తున్నారు. స్థానిక సంస్థలను బలోపేతం చేయడానికి మరిన్ని చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇప్పటికే పంచాయతీల్లో..

జిల్లాలో 526 గ్రామ పంచాయతీలు ఉండగా 2019 జనవరి నెలలో మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించారు. ఇందులో రిజర్వేషన్‌ సమస్యతో కాటేపల్లి తండా పంచాయతీ ఎన్నిక జరగలేదు. మిగతా 525 పంచాయతీలకు ఎన్నికలు జరిగి, ఫిబ్రవరి 1 న పాలక వర్గాలు కొలువుదీరాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 1 తో ఐదేళ్ల పదవీ కాలం ముగిసింది. పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారని అందరూ భావించినా ప్రభుత్వం ఆరు నెలల కోసం ప్రత్యేకాధికారులను నియమించింది. ఫిబ్రవరి 1 నుంచి పంచాయతీ వ్యవహారాలన్నీ ప్రత్యేకారుల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శుల నేతృత్వంలో జరుగుతున్నాయి. పంచాయతీ ఎన్నికల కోసం ఎన్నో ఆశలు పెట్టుకున్న ఎంతో మంది ఎన్నికలు వాయిదాపడడంతో నీరసపడ్డారు.

మండల,జిల్లా పరిషత్‌లదీ అదే దారి..

స్థానిక సంస్థల్లో కీలకమైన మండల పరిషత్‌, జిల్లా పరిషత్‌ పాలక వర్గాల పదవీ కాలం ఈనెల 3, 4 తేదీలలో ముగియనుంది. 2019 మే 6, 10, 13 తేదీలలో మూడు విడతల్లో మండల, జిల్లా పరిషత్‌ ఎన్నికలు జరిగాయి. జిల్లాలో 22 జెడ్పీటీసీ స్థానాలతో పాటు 236 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగిన తర్వాత జూన్‌ 4న ఓట్ల లెక్కింపు జరిగింది. అదే నెల 7, 8 తేదీలలో ఎంపీపీ, జెడ్పీ చైర్మన్‌ ఎన్నికలు నిర్వహించారు. జూలై 4న ఎంపీపీలు, జూలై 5న జెడ్పీ చైర్మన్‌ బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఈనెల 3న మండల, 4న జెడ్పీల పదవీ కాలం ముగియనుంది. దీంతో ప్రత్యేకాధికారులను నియమించి పాలన కొనసాగించే అవకాశాలున్నాయి.

నేతలిద్దరూ ఒక్కటయ్యారు

- నిన్నటి వరకు ప్రత్యర్థులు.. నేడు మిత్రులు
- కలిసిపోయిన పోచారం, కాసుల వర్గాలు
- ఏనుగు వర్గం దారెటు అన్న అంశంపై కాంగ్రెస్‌లో చర్చ

సాక్షి, కామారెడ్డి: రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఎవరూ ఉండరన్నది అక్షర సత్యం. బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గంలో నిన్నటివరకు ప్రత్యర్థులుగా ఉన్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాసుల బాలరాజులు కలిసిపోవడం దీనికి నిదర్శనంగా చెబుతున్నారు. వీరిద్దరు సుమారు పదిహేనేళ్లుగా రాజకీయ ప్రత్యర్థులు. 2009 ఎన్నికల్లో పోచారం శ్రీనివాస్‌రెడ్డి టీడీపీ తరఫున బరిలో నిలవగా కాసుల బాలరాజు ప్రజారాజ్యం అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో పోచారం ఘన విజయం సాధించారు. 2014లో పోచారం బీఆర్‌ఎస్‌ అభ్యర్థిగా, బాలరాజు కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ ఎన్నికల్లోనూ పోచారందే పైచేయి అయ్యింది. 2018లోనూ వీరిద్దరి మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. బాలరాజును పోచారం వరుసగా మూడోసారి ఓడించారు. 2023 ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌ పార్టీ నుంచి పోటీ చేయడానికి కాసుల బాలరాజు ప్రయత్నించగా.. చివరి నిమిషంలో టికెట్టు ఏనుగు రవీందర్‌రెడ్డిని వరించింది. అనంతరం కాంగ్రెస్‌ అధికారంలోకి రావడంతో అధిష్టానం బాలరాజుకు రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ పదవి ఇచ్చింది. ఇటీవల జరిగి పరిణామాల్లో అనూహ్యంగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి బీఆర్‌ఎస్‌ను వీడి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. దీంతో రాజకీయ ప్రత్యర్థులు ఒకే గూటికి చేరినట్లయ్యింది. మంగళవారం బాన్సువాడకు వచ్చిన పోచారంను కాసుల బాల్‌రాజుతో పాటు ఆయన అనుచరులంతా వెళ్లి కలిశారు. ఒకరికొకరం సహకరించుకుంటామని పేర్కొన్నారు. దీంతో ఇంతకాలం రాజకీయంగా ప్రత్యర్థులుగా ఉన్న ఇద్దరు నేతలు ఒక్కటయ్యారని నియోజకవర్గ ప్రజలు మాట్లాడుకుంటున్నారు.

కిం కర్తవ్యం?

బాన్సువాడ నియోజకవర్గంలో పోచారం శ్రీనివాస్‌రెడ్డిని వ్యతిరేకించేవారంతా మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి వెంట నడిచారు. పోచారంను చేర్చుకోవద్దంటూ ఏనుగు అనుచరులంతా హైదరాబాద్‌కు వెళ్లి మంత్రులు, నేతలను కలిసి విన్నవించారు. అయినా అధిష్టానం వారి అభిప్రాయాలను పక్కనపెట్టి పోచారం శ్రీనివాస్‌రెడ్డికి కాంగ్రెస్‌ తీర్థం ఇచ్చింది. దీంతో ఇన్నాళ్లూ పోచారంను వ్యతిరేకించినవారి పరిస్థితి అయోమయంలో పడింది. తాము ఇన్నాళ్లూ వ్యతిరేకించిన నాయకుడు ప్రస్తుతం తమ పార్టీలోకే వచ్చారని, ఇప్పుడు ఆయనతో ఎలా కలిసి పనిచేస్తామని వారు ప్రశ్నిస్తున్నారు. కాగా ఇటీవల ఏనుగు రవీందర్‌రెడ్డి పార్టీ శ్రేణులతో సమావేశమై తాను బాన్సువాడలోనే ఉంటానని, కార్యకర్తలకు అండగా నిలుస్తానని, ఎవరూ అధైర్యపడొద్దని పేర్కొన్నారు. అయితే పోచారం, కాసుల వర్గాలు కలిసిపోయిన నేపథ్యంలో ఏనుగు వర్గం దారెటు అన్న అంశంపై నియోజకవర్గంలో చర్చ నడుస్తోంది.



ఎమ్మెల్యే పోచారంను సన్మానిస్తున్న కాసుల బాలరాజు

'పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి'


పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న డీఈవో రాజు

లింగంపేట: పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని డీఈవో, లింగంపేట మండల ప్రత్యేకాధికారి రాజు సూచించారు. మంగళవారం ఆయన లింగంపేట బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించారు. జిల్లాలో వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు, కుళాయిల వద్ద నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలల్లో చేపట్టిన పనులను పూర్తి చేశామన్నారు. అనంతరం ఎమ్మార్సీని సందర్శించారు. జిల్లాలోని అన్ని పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు, నోటుబుక్కులు, ఏకరూప దుస్తులు పంపిణీ చేశామన్నారు. విద్యార్థులకు పంపిణీ చేసిన పుస్తకాలు, యూనిఫామ్‌ల వివరాలను డీఈవో కార్యాలయానికి పంపాలని సీఆర్పీలను ఆదేశించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు వహీద్‌ సిద్దిఖీ, సూర్య, రాజు, స్వప్న, సీఆర్పీలు విజయ్‌, గంగాధర్‌ సిబ్బంది తదితరులున్నారు.

'పారిశుధ్య పనులు చేపట్టాలి'



కామారెడ్డి క్రైం: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులను పక్కాగా చేపట్టాలని కలెక్టర్‌ ఆశిష్‌ సంగ్వాన్‌ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీజనల్‌ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పారిశుధ్య పనులపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇంటి పన్నులను వసూలు చేయాలన్నారు. నిబంధనల ప్రకారమే లేఅవుట్‌, భవనాల అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌ శ్రీనివాస్‌రెడ్డి, ఇంజినీరింగ్‌ అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లో చేరా

- పదవులకోసం కాదు..
- బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం, పక్కన కాసుల బాలరాజు

బాన్సువాడ: తాను పదవుల కోసం కాకుండా నియోజకవర్గ అభివృద్ధి కోసమే పార్టీ మారానని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బాన్సువాడకు వచ్చిన పోచారం శ్రీనివాస్‌రెడ్డిని ఆగ్రో ఇండస్ట్రీస్‌ చైర్మన్‌ కాసుల బాలరాజు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ తన రాజకీయ జీవితం ముగిసేలోపు నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. కాంగ్రెస్‌లో ఉన్న ప్రతి ఒక్కరిని కలుపుకొని ముందుకు వెళ్తానని, ఏకపక్ష నిర్ణయాలు ఉండవని పేర్కొన్నారు. టీడీపీలో కాసుల బాలరాజు, తాను ఇద్దరం అత్యంత సన్నిహితంగా ఉండేవాళ్లమని గుర్తు చేసుకున్నారు. తర్వాత రాజకీయంగా విడిపోయినా ఇద్దరి మధ్య ఎలాంటి వ్యక్తిగత వైరం లేదన్నారు. ఎప్పుడైనా లోకల్‌ లోకలేనని, బయట నుంచి వచ్చిన వాళ్లు అద్దెకు ఉండేవారు మాత్రమేనని పేర్కొన్నారు. బాలరాజుకు కార్పొరేషన్‌ పదవి వస్తే వాళ్లకు కడుపు నొప్పి ఎందుకని విమర్శించారు. నియోజకవర్గ అభివృద్ధికి మాజీ సీఎం కేసీఆర్‌ కూడా సహకరించారని గుర్తు చేసుకున్నారు.

ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకునే ముందు సీఎం రేవంత్‌రెడ్డి తనకు ఫోన్‌ చేశారని కాసుల బాలరాజు పేర్కొన్నారు. అధిష్టానం తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉంటానని సీఎంకు చెప్పానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు ఖలేక్‌, అలిబిన్‌ అబ్దుల్లా, కాసుల రోహిత్‌, జహీరొద్దీన్‌, నార్ల సురేష్‌, దొంతురాం కాశీరాం, శంకర్‌, రెంజర్ల సాయిలు, అజీం, నేమాని వీర్రాజు, అఫ్రోజ్‌, తోట అరుణ్‌, లక్ష్మణ్‌, మనోహర్‌, రహీస్‌, దాసరి శ్రీనివాస్‌, జీ నగేష్‌ తదితరులు పాల్గొన్నారు.

అతివల రక్షణలో షీ టీమ్స్‌!

- ఆకతాయిల ఆటకట్టిస్తున్న పోలీసులు
- జిల్లాలో మూడు సబ్‌ డివిజన్లలో ప్రత్యేక బృందాలు
- ఆపదలో ఆదుకుంటూ భరోసా



సాక్షి, కామారెడ్డి: బాలికలు, యువతులు, మహిళలకు ఏ ఆపద వచ్చినా ఒక్క ఫోన్‌ కాల్‌తో షీ టీమ్‌లు రంగంలోకి దిగుతున్నాయి. ఆకతాయిల ఆటకట్టించి మేమున్నామన్న భరోసా ఇస్తున్నాయి. పోలీస్‌ శాఖ ఆధ్వర్యంలో షీ టీమ్‌లు ఏర్పాటై పదేళ్లవుతోంది. పదేళ్లలో అనేక మందికి షీ టీమ్‌లు అండగా నిలిచాయి. జిల్లాలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ పోలీస్‌ సబ్‌ డివిజన్‌లలో షీటీమ్స్‌ పనిచేస్తున్నాయి. దాడులు జరిగినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న విషయంపై ఈ బృందాలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ప్రభుత్వ కళాశాలలు, రైల్వే స్టేషన్‌, బస్టాండ్లు, ప్రభుత్వ పాఠశాలలు, తెలంగాణ మోడల్‌ స్కూళ్లు, రెసిడెన్షియల్‌ స్కూళ్లు, కేజీబీవీలలో ర్యాగింగ్‌, ఈవ్‌టీజింగ్‌ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఆయా అంశాలపై అవగాహన కల్పించారు.

సబ్‌ డివిజన్ల వారీగా నమోదైన కేసులు..

డివిజన్‌	కామారెడ్డి	బాన్సువాడ	ఎల్లారెడ్డి
మొత్తం పిటిషన్లు	84	32	29
సాధారణ పిటిషన్లు	55	18	17
ఈవ్‌ టీజింగ్‌	29	14	12
ఎఫ్‌ఐఆర్‌	24	10	07
పెట్టి కేసులు	32	18	19
అవగాహన కార్యక్రమాలు	125	135	93
హాట్‌స్పాట్‌లు	441	476	273



ఆరు నెలల్లో 353 కార్యక్రమాలు..
జిల్లాలో ఈ ఏడాది ఆరు నెలల కాలంలో 353 కార్యక్రమాలు నిర్వహించారు. బస్టాండ్లు, కళాశాలలు, సినిమా హాళ్లు తదితర ప్రాంతాలలో క్యూఆర్‌ కోడ్స్‌తో రూపొందించిన పోస్టర్స్‌ అతికించారు. మహిళలకు ఏవైనా సమస్యలు ఎదురైతే క్యూఆర్‌ కోడ్‌ను స్కాన్‌ చేసి ఎక్కడి నుంచి అయినా ఆన్‌లైన్‌ ద్వారా ఫిర్యాదు చేసేందుకు ఈ ఏర్పాటు చేశారు. తరుచూ నేరాలు జరిగే ప్రదేశాలను గుర్తించి, మఫ్టీలో షీ టీమ్‌లు మాటు వేస్తున్నాయి. ఆయా ప్రదేశాలలో ఆకతాయిలను గుర్తించి వారిలో మార్పు తీసుకురావడం కోసం వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్‌లు ఇస్తున్నారు. ఇలా చేయడం వల్ల వారు తప్పును తెలుసుకుని మారేందుకు అవకాశం ఉంటుందన్నది షీటీమ్స్‌ ఉద్దేశం.

ఈ ఏడాది 145 ఫిర్యాదులు...
జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి జూన్‌ నెలాఖరు వరకు షీటీమ్‌కు 145 ఫిర్యాదులు వచ్చాయి. 41 కేసులు నమోదు చేశారు. ఈవ్‌ టీజింగ్‌కు పాల్పడిన 55 మందిని పట్టుకొని కౌన్సెలింగ్‌ ఇచ్చారు. అలాగే 69 పిటీ కేసులు నమోదు చేశారు. మహిళలు సామాజిక మధ్యమాలైన ఫేస్‌బుక్‌, వాట్సాప్‌, ఇన్‌స్టాగామ్‌ల వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలని, ఫొటోలు, వీడియోలను పోస్ట్‌ చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించిన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొంటున్నారు. ఎవరైనా వేధిస్తే వెంటనే 87126 86094 కు కాల్‌ చేయాలని సూచిస్తున్నారు. ఎటువంటి సందర్భంలోనైనా 100 నంబర్‌కు కాల్‌ చేస్తే పోలీసులు సమస్యను పరిష్కరిస్తారని పేర్కొంటున్నారు.

మహిళల రక్షణ కోసం..



ఆపదలో ఉన్న మహిళలకు భద్రత కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో ప్రతి సబ్‌ డివిజన్‌కు ఒక సబ్‌ డివిజనల్‌ పోలీసు ఆఫీసర్‌ స్థాయి అధికారి ఆధ్వర్యంలో షీటీమ్‌లను ఏర్పాటు చేశాం. మూడు సబ్‌ డివిజన్లలో ఈ బృందాలు క్రియాశీలకంగా పనిచేస్తున్నాయి. మహిళలు, యువతులు ఎలాంటి సమస్య ఉన్నా నిర్భయంగా పోలీస్‌లకు సమాచారం ఇస్తే ఆ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– సింధుశర్మ, ఎస్పీ, కామారెడ్డి

క్లుప్తంగా

జాతీయ రహదారిపై రాస్తారోకో

సదాశివనగర్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు న్యాయం చేయాలంటూ మండల శివారులోని జాతీయ రహదారిపై కాటేవాడ తండాకు చెందిన బాధిత కుటుంబాలు, తండావాసులు మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. మండల శివారులో సోమవారం హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపునకు వెళ్తున్న లారీ ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొన్నది. ఈ ఘటనలో గాంధారి మండలం కాటేవాడ తండాకు చెందిన రవీందర్ అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తి దేవిసింగ్ హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనకు కారకుడైన లారీ డ్రైవర్‌పై తగు చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని తండావాసులు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బాధిత కుటుంబాలతో మాట్లాడి సముదాయించి రాస్తారోకోను విరమింపజేశారు. రాస్తారోకోతో జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలను పోలీసులు క్రమబద్ధీకరించారు.

అన్నదాతలకు అండగా ఉంటాం

భిక్కనూరు : తమ ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని, అన్నదాతలకు ఎలాంటి ఇబ్బందులు పెట్టినా ఊరుకునేది లేదని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. మంగళవారం భిక్కనూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పదెకరాల లోపు భూములు ఉన్న రైతులందరికీ రైతుభరోసా ఇవ్వాలని సభ్యులు తీర్మానించడం హర్షనీయమన్నారు. కొంతమంది అధికారులు ప్రభుత్వాన్ని బద్నాం చేయడానికి రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఊరుకునేది లేదన్నారు. ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. త్వరలోనే రూ. 2 లక్షల రుణమాఫీ అమలు చేస్తామన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను ప్రభుత్వం సకాలంలో అందించిన విషయాన్ని గుర్తు చేశారు. భిక్కనూరు మండలంలోని మోటాటిపల్లి, తిప్పాపూర్, జంగంపల్లి, అంతంపల్లి గ్రామాలు రాజంపేట పీహెచ్‌సీ పరిధిలో ఉన్నాయని, వీటిని భిక్కనూరు పీహెచ్‌సీలోకి మార్చాలని సభ్యులు షబ్బీర్ అలీని కోరగా, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానన్నారు. సమావేశంలో ఎంపీపీ గాల్‌రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ శివప్రసాద్, ప్రత్యేకాధికారి రజిత, డీసీసీబీ డైరెక్టర్లు కిష్టాగౌడ్, సిద్దరాములు తదితరులు పాల్గొన్నారు.



భిక్కనూరులో మండల పరిషత్ ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

కేసీఆర్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బలు..

దేశంలో అందరు సీఎంలకంటే అప్పటి తెలంగాణ సీఎం కేసీఆర్‌కు హైకోర్టు పలుమార్లు మొట్టికాయలు వేసిందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. రాజకీయ లబ్ధికోసమే కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును, ప్రధాని మోదీ అయోధ్య రామాలయాన్ని ఆగమాగం నిర్మింపజేశారన్నారు. కాళేశ్వరం కుంగుతుండగా, రామాలయం వర్షానికి ఊరుస్తుందన్నారు. కేసీఆర్ తన హయాంలో 49 మంది ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలను తన పార్టీలోకి చేర్చుకుని ఇప్పుడు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. త్వరలోనే కేసీఆర్ దుఖాణం మూసుకుంటుందన్నారు. మాచారెడ్డిలో 132 కేవీ సబ్‌స్టేషన్, కామారెడ్డిలో 220 కేవీ సబ్‌స్టేషన్లను నిర్మించేందుకు సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించాచన్నారు.

సభను బహిష్కరించిన బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు

మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన మండల సమావేశాన్ని బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు, వింటో చైర్మన్లు బహిష్కరించారు. షబ్బీర్‌అలీ కోసమే సమావేశాన్ని ఏర్పాటు చేశారని, అందుకే తాము బహిష్కరిస్తున్నట్లు ఎంపీటీసీల ఫోరం కన్వీనర్ ద్యావర సాయిరెడ్డి అన్నారు.

సంక్షిప్తం

కరపత్రాలతో ఇంటింటి ప్రచారం

బాన్సువాడ రూరల్ : మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గంగాధర్ ఆధ్వర్యంలో మంగళవారం డిగ్రీకళాశాలలో అడ్మిషన్ల కోసం మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. కళాశాలకు న్యాక్ గుర్తింపుతో పాటు అటానమస్ అర్హత లభించిందన్నారు.

షబ్బీర్ అలీని కలిసిన నాయకులు



రాజంపేట : భిక్కనూరు మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ ప్రత్యేక సమావేశంలో రాజంపేట మండలానికి చెందిన మండల యూత్ కాంగ్రెస్ నాయకులు అంకం కిష్టారావ్, ఆముద నాగరాజు, పటేల్ సాయిబాబ, శ్రీరాం సురేష్ లు మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు.

నేడు తైబజార్ వేలం

లింగంపేట(ఎల్లారెడ్డి) : లింగంపేట జీపీ 2024–25కు గాను తైబజార్, దడ్వాయి వేలంను బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు గ్రామ జీపీ ఆవరణలో నిర్వహించనున్నట్లు కార్యదర్శి శ్రావణ్‌కుమార్ తెలిపారు. తైబజార్ వేలంలో పాల్గొనే వారు రూ. 50 వేలు, దడ్వాయి వేలంలో పాల్గొనే వారు రూ. 25 వేలు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలన్నారు.

అధిక ఫీజు వసూళ్లను అరికట్టాలి



కామారెడ్డి టౌన్ : జిల్లాలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. డీఈవో ఎస్.రాజుకు వినతిపత్రం అందజేశారు. విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ చాలా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో గవర్నింగ్ బాడీ ఏర్పాటు చేయకుండా, సమావేశం జరపకుండా ఇష్టానుసారంగా ఫీజులను వసూళ్లు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఐఐటి, దిశ, ఒలంపియాడ్ పేర్లతో అధనంగా మరో రూ. 20 వేల వరకు దండుకుంటున్నారన్నారు. బీవీఎం రాష్ట్ర కార్యదర్శి విఠల్, ఎస్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి భరత్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, బీడీఎస్ఎఫ్, బీవీఎం జిల్లా అధ్యక్షులు అరుణ్ కుమార్, సురేష్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి..

మాచారెడ్డి : సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి టీవీ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం గజ్యా నాయక్ తండా చౌరస్తాలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇంటి పరిసరాల్లో నీటి గుంతలు లేకుండా చూడాలన్నారు.ఎంపీడీవో గోపిబాబు, ఏపీవో సాయిబాబా, పంచాయతి కార్యదర్శి రిజ్వానబేగం సిబ్బంది ఉన్నారు.

కళ్లకు గంతలతో ఏబీవీపీ నిరసన

కామారెడ్డి టౌన్ : ఏబీవీపీ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు విద్యార్థులతో కలిసి కళ్లకు గంతలు కట్టుకుని ఏబీవీపీ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా హస్టల్ కన్వీనర్ ఖలీల్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 25వేల పోస్టులతో మెగా డీఎస్సీ వెంటనే ప్రకటించి, ఖాళీలుగా ఉన్న 2లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ప్రత్యూష, నాయకులు అల్తాఫ్, రాజు తదితరులున్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : చట్టాలపై ప్రతి ఒక్క విద్యార్థిని కనీస అవగాహన కలిగి ఉండాలని సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ సలీం సూచించారు. మంగళవారం మండలంలోని మర్కల్ స్టేజీ వద్ద గల గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సహ చట్టం జిల్లా మహిళ ఉపాధ్యక్షురాలు శ్వేత, మహ్మద్ సాదీకలీ, న్యాయవాది ఈక శ్రీనివాస్, ప్రిన్సిపాల్ రాధిక ఉన్నారు.

హెడ్‌మాస్టర్ సేవలు మరువలేనివి



కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి పట్టణ పరిధిలోని సరంపల్లి ప్రాథమిక పాఠశాల హెడ్‌మాస్టర్‌గా పన్నెండేళ్లుగా పనిచేసి ప్రమోషన్‌పై బదిలీ అయిన దేవేందర్‌కు మంగళవారం సాయంత్రం గ్రామస్తులు, విద్యార్థులు భావోద్వేగాలతో వీడ్కోలు పలికారు. దేవేందర్ పాఠశాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారని మాజీ సర్పంచ్‌లు నిట్టు గంగాధర్, ముల్కరాజు, పాల సంఘం అధ్యక్షుడు ఆకుల రవి కుమార్, సోసైటీ డైరెక్టర్ బి.రాజు, మాజీ ఎంపీటీసీ బాల్‌రాజులు అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఆకుల రూప, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే మదన్‌మోహన్



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సీఎం రేవంత్‌రెడ్డి, నోకియా జర్మని ప్రతినిధుల బృందంతో మంగళవారం హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. 5జీ నెట్‌వర్క్ అభివృద్ధితో పాటే విద్యార్థులకు నాణ్యమైన విద్యకు సంబంధించి, ల్యాప్‌టాప్‌ల అందజేత తదితర వాటికి సంబంధించి చర్చించామన్నారు.

మాదిగల మహా జాతరకు తరలిరావాలి

కామారెడ్డి అర్బన్ : మాదిగ రాజకీయ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) ఆవిర్భవించి 30 ఏళ్లు అవుతున్న సందర్భంగా ఈనెల 7న ఆంధ్రప్రదేశ్, ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఈదుముడిలో నిర్వహించే మాదిగల మహా జాతరకు పెద్ద ఎత్తున తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చిట్యాల సాయన్న, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.బాగయ్యలు పిలుపు నిచ్చారు. మంగళవారం స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో కరపత్రాలను ఆవిష్కరించారు.

కేసీఆర్‌ను కలిసిన జెడ్పీ చైర్‌పర్సన్



నిజాంసాగర్(జుక్కల్): బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను మంగళవారం ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ రాజు దంపతులు కలిశారు. ఐదేళ్ల పదవీకాలంలో జిల్లా అభ్యున్నతికి మాజీ సీఎం కేసీఆర్ అందించిన సేవలు ఎన్నటికి మర్చిపోలేమని జెడ్పీచైర్‌పర్సన్ అన్నారు. ఉమ్మడి జిల్లా జెడ్పీచైర్మన్‌గా, కొత్త జిల్లాకు మొదటి జెడ్పీ చైర్‌పర్సన్‌గా బీఆర్‌ఎస్ పార్టీ తరపున పదవులు మాజీ సీఎం కేసీఆర్ చొరవతో దక్కాయన్నారు. బీఆర్‌ఎస్ పార్టీలోనే ఉంటామని జెడ్పీ చైర్‌పర్సన్ దంపతులు 'సాక్షి'లో పేర్కొన్నారు.

నియామకం

కామారెడ్డి టౌన్ : బీజేపీ ఎస్సీ మోర్చా కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జీగా తలారి బాల్‌రాజును ఆ పార్టీ రాష్ట్ర శాఖ మంగళవారం నియమించింది. ఈ మేరకు దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కోనిదేటి శ్రీదర్ ఉత్తర్వులను జారీ చేశారు.

భోజనం అమలు తీరుపై ఆగ్రహం



కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలను మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థినీలతో కలిసి భోజనం చేశారు. పాఠశాలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భోజనం మెనూ ప్రకారం పెట్టకుండా రోజు ఒకే రకమైన కూరలు వంటి పెట్టడం, స్నాక్స్ పెట్టకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాత్‌రూంలు, మరుగుదోడ్లు అధ్వానంగా ఉన్నాయని, నీటి సౌకర్యం సరిగా లేదని విద్యార్థినీలు తెలపడంతో ఫోన్‌లో ప్రిన్సిపల్‌తో మాట్లాడారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కౌన్సిలర్లు పాత శివ కృష్ణమూర్తి, అన్వర్ అహ్మద్, మిర్జా ఆఫీస్ బేగ్, అంజల్ రెడ్డి, ఇమ్రాన్, చాట్ల వంశీ, నాయకులు ప్రసన్న, తేజపు ప్రసాద్, అంజద్, గణేష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అమ్మ పేరిట ఒక మొక్క



రాజంపేట : శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి ఉత్సవాల్లో భాగంగా ప్రధాని మోదీ పిలుపు మేరకు మంగళవారం బీజేపీ మహిళ మోర్చా రాష్ట్ర కార్యదర్శి సంధ్యబాల్‌రాజ్ శివాయిపల్లి గ్రామంలో మహిళలతో కలిసి మొక్కను నాటారు. ప్రతి మహిళ కార్యకర్త తమవంతు బాధ్యతగా అమ్మ పేరున ఒక్క మొక్కను నాటి దానిని సంరక్షిస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు.

పాఠశాలలో త్వరలో పనులు పూర్తి చేయాలి

బిచ్కుంద(జుక్కల్) : మన ఊరు మనబడి, అమ్మా ఆదర్శ పాఠశాలలో కొనసాగుతున్న పనులను కాంట్రాక్టర్ త్వరలో పూర్తి చేయాలని ఎంపీడీవో గోపాల్ అన్నారు. మండలంలోని ఆయా గ్రామాలలో కొనసాగుతున్న పనులు పరిశీలిస్తూ పనుల్లో వేగం పెంచాలని అన్నారు. లీకేజీలు గుర్తించి వెంటనే మరమ్మతులు చేసి క్లోరినేషన్ నీటిని అందించాలని కార్యదర్శులకు ఆదేశించామన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ ఉన్నత పాఠశాలలో 2003–04లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 20 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు అందరూ ఒకో చోట కలవడంతో ఆనందం వ్యక్తం చేశారు. ఒకరి యోగా క్షేమాలను మరొకరు అడిగి తెలుసుకున్నారు. నాటి గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గురువులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సాగులో లేని భూములపై సర్వే



దోమకొండ : సాగులో లేని వ్యవసాయ భూములపై సర్వే చేస్తున్నట్లు వ్యవసాయశాఖ ఏడీఏ అపర్ణ అన్నారు. సోమవారం ఉమ్మడి దోమకొండ మండలంలోని పలు గ్రామాల్లో సర్వే నిర్వహించినట్లు ఈ సందర్భంగా ఆమె తెలిపారు. దోమకొండ మండలంలో 2619 సర్వే నెంబర్లలో దాదాపు 300 ఎకరాలు సాగులో లేని భూమి ఉన్నట్లు ఆమె తెలిపారు. వాటిని ఫొటోలు తీసి నిర్ధారిస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా బీబీపేట మండలంలో 3518 సర్వేనెంబర్లలో దాదాపు 500 ఎకరాలు సాగులో లేని భూమి ఉన్నట్లు తెలిపారు. ఏవో మండల వ్యవసాయాధికారి పవన్‌కుమార్, ఏఈవో కిష్టారెడ్డి తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

పర్మిట్ రూంలో వ్యక్తి మృతి



వర్ని(మోస్రా): మండల కేంద్రంలోని దుర్గా వైన్స్ పర్మిట్ రూంలో బైరాగి శ్రీను(30) అతిగా మద్యం సేవించి మృతి చెందినట్లు వర్ని ఎస్సై కృష్ణకుమార్ మంగళవారం పేర్కొన్నారు. పెగడపల్లికి చెందిన శ్రీను మండలంలోని తిమ్మాపూర్‌లో మంగళవారం బంధువుల అంత్యక్రియల నిమిత్తం వచ్చి తిరుగు ప్రయాణంలో మోస్రా పర్మిట్ రూంలో అతిగా మద్యం సేవించి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

భిక్కనూరు: మండలంలోని బాగిర్తిపల్లికి చెందిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై సాయికుమార్ మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన మంద రమేశ్(29) ఇంటి నిర్మాణానికి బ్యాంక్‌లో ఆరు నెలల క్రితం రూ. 2.40 లక్షలు, గ్రామంలో ఇతరుల వద్ద అప్పులు తీసుకున్నాడు. కాని అప్పులు భారంగా మారడంతో గత నెల 27న ఇంటి నుంచి బయటకు వెళ్లి పురుగుల మందు తాగి ఇంటికి వచ్చాడు. వెంటనే కుటుంబీకులు రామాయంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి భార్య సవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరి మృతి



దోమకొండ: మండల కేంద్రంలోని బస్టాండ్ మూల మలుపు వద్ద బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. ఎస్సై గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. దోమకొండకు చెందిన చాకలి బాలు(45) గ్రామంలో మేస్త్రీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మంగళవారం రాత్రి ఇంటికి నడుచుకుంటు పాల ప్యాకెట్ తీసుకెళ్తుండగా బస్టాండ్ మూల మలుపు వద్ద ఆర్టీసీ బస్సు బాలును ఢీకొన్నది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందగా ఈ విషయం బస్సు డ్రైవర్ గమనించలేదు. ఆ ప్రాంతంలో చీకటి, మూల మలుపు ఉండడంతో ఆ బస్సు వెనుకాలే వచ్చిన మరో మూడు బస్సులు వెళ్లడంతో మృతదేహం ఛిద్రమైందని ఎస్సై పేర్కొన్నారు. సీసీ కెమెరాల ఆధారంగా విచారిస్తున్న తెలిపారు.

ఇసుక లారీల పట్టివేత

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని హజ్గుల్ మంజీరా క్వారీ నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీలను పట్టుకున్నట్లు ఎస్సై మోహన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. క్వారీలో జీరో బిల్లులతో వందల లారీలలో ఇసుక నింపి తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్సై గోపన్‌పల్లి చౌరస్తాలో లారీలను తనిఖీ చేశారు. పోలీసులు వస్తున్న సమాచారంతో క్వారీ నిర్వాహకుడు జాగ్రత్తపడి వేరే దారినుంచి లారీలను తరలించారు. పోలీసులు స్పందించి ఐదు ఇసుక లారీలను పట్టుకున్నారు. మైన్స్ అధికారులకు అప్పగిస్తామని ఎస్సై తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

డిచ్‌పల్లి: మండల పీఎస్ పరిధిలో జమీర్ అనే యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలానికి చెందిన బాలికతో మేస్త్రీ పని చేసే జమీర్‌కు 8 నెలల క్రితం పరిచయం ఏర్పడింది. నిందితుడు ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలుమార్లు అత్యాచారం చేశాడు. కొద్ది రోజులకు బాలిక గర్భం దాల్చింది. దీంతో నిందితుడు ఆమెకు చెప్పకుండా పారిపోయాడు. జూన్ 29న రాత్రి బాలికకు కడుపునొప్పి రాగా ఆమె తల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించింది. నెలలు నిండక పోవడంతో ఐసీయూలో ఉంచగా జూలై 1న ఆడశిశువు మృతి చెందింది. జమీర్‌పై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో ఐపీసీ సెక్షన్ 376, పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఘటన పాతది కావడంతో పాత చట్టం ప్రకారమే జమీర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గోదావరిలో దూకేందుకు యత్నం

నవీపేట: మండలంలోని యంచ శివారులోని గోదావరి నదిలో మంగళవారం ఒకరు దూకేందుకు యత్నించగా యంచ గ్రామస్తులు కాపాడారు. నిర్మల్ జిల్లా బాసర సమీపంలోని మైలారం గ్రామానికి చెందిన నాగేశ్ కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది గోదావరి నదిలో దూకేందుకు యత్నిస్తుండగా గమనించిన యంచ గ్రామానికి చెందిన నారాయణ, సంతోష్, లింగంలు అతడిని కాపాడారు.

జాగ్రత్తగా రోడ్డు దాటాలి



కామారెడ్డి క్రైం : రోడ్డు దాటే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి జిల్లా కేంద్రంలోని గొల్లవాడ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు సూచించారు. మంగళవారం ఆయన పాఠశాలను సందర్శించి విద్యార్థులకు సూచనలు చేశారు. 100 నెంబర్‌కు డయల్ చేయడంపై విద్యార్థులకు వివరించారు.

లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో చోరీ


వివరాలు సేకరిస్తున్న ఎస్సై వంశీకృష్ణ

ఎడపల్లి: జానకంపేట శివారులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సోమవారం అర్ధరాత్రి దుండగులు చోరీకి యత్నించారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆలయంలో దుండగులు సీసీ కెమెరాలను ధ్వంసం చేసి ఆలయానికి ఉన్న తాళాలు పగలగొట్టి హుండీని ధ్వంసం చేసే ప్రయత్నం చేశారు. అదే సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసు వాహనం సైరన్ చేసుకుంటూ వెళ్తుండడంతో దొంగలు భయపడి పారిపోయారు. మంగళవారం ఉదయం ఆలయ పూజారులు తాళాలు పగలగొట్టి ఉండటాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై వంశీకృష్ణ వేలిముద్ర నిపుణులను రప్పించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆలయ కార్యనిర్వాహక అధికారి వేణు ఆధ్వర్యంలో గుడిలో ఉన్న హుండీలను తీసి డబ్బులు లెక్కించారు. పోలీసులు సకాలంలో పెట్రోలింగ్ నిర్వహించడంతో ఎలాంటి నగదు నష్టం జరగలేదన్నారు. ఆలయానికి సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బోర్లం క్యాంప్‌లో..

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం క్యాంప్‌లో ఉన్న దుర్గమ్మ ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. అమ్మవారి విగ్రహానికి ఉన్న బంగారు కండ్లు, ముక్కుపుడక, కుంకుమ భరిణి, హుండీలోని నగదును దొంగిలించినట్లు ఆలయ నిర్వాహకుడు కాశ మల్లేశం తెలిపారు. విషయం తెలుసుకున్న సీఐ కృష్ణ ఆలయానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఆలయ నిర్వాహకుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ధర్పల్లిలో..

ధర్పల్లి: మండల కేంద్రంలోని పెద్దమ్మ తల్లి, రేణుకా ఎల్లమ్మ ఆలయాలతో పాటు మండల శివారులోని మద్దుల్ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఆలయాల గేటు తాళాలు పగలగొట్టి చోరీకి యత్నించినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఉదయం వచ్చిన పూజారులు పగులగొట్టిన తాళాలను గమనించి ఆలయ కమిటీలకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలాలను పరిశీలించారు. ముందస్తు జాగ్రత్తగా అలయ కమిటీ వారు ఆలయాల్లో బంగారు ఆభరణాలను ఉంచకపోవడంతో ఆభరణాలు చోరీకి గురికాలేవని ఎస్సై పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, చుట్టుపక్కల సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలిస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తండ్రీ కొడుకులకు విద్యుదాఘాతం

- తండ్రి మృతి, కుమారుడికి గాయాలు


భూమయ్య మృతదేహం

మాచారెడ్డి: పొలంలో లీక వుతున్న బోరు మోటారు పైపునకు బట్ట చుడుతుండగా విద్యుదాఘాతం సంభవించిన ఘటనలో తండ్రి మృతి చెందగా కాపాడబోయిన కుమారుడికి గాయాలైన ఘటన మండలంలోని లక్ష్మీరావుపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పుట్ట భూమయ్య(45), ఆయన కుమారుడు ఆంజనేయులు గ్రామ శివారులోని పొలం వద్దకు వెళ్లారు. బోరు మోటారు పైపు లీకవుతుందని దానికి భూమయ్య బట్ట పీలిక చుడుతుండగా విద్యుదాఘాతం సంభవించి కిందపడిపోయాడు. తండ్రిని కాపాడే క్రమంలో ఆంజనేయులు సైతం కరెంట్ షాక్‌కు గురై కిందపడిపోయాడు. వెంటనే తేరుకొని మోటారును బంద్ జేశాడు. కానీ అప్పటికే భూమయ్య మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కోస్లీ గ్రామంలో..

నవీపేట: మండలంలోని కోస్లీ గ్రామానికి చెందిన కంచరి రమేశ్(42) మంగళవారం సాయంత్రం విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు ఎస్సై యాద గిరిగౌడ్ తెలిపారు. ఈదురు గాలులకు లేచిన రేకుల ఇంటి పైకప్పును సరి చేస్తుండగా సర్వీస్ వైరు తెగి రేకులపై పడడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

3.30 కేజీల గంజాయి పట్టివేత

- నిందితులపై కేసు నమోదు


నిందితుడితో ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంట్ సిబ్బంది

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రెండు వేర్వేరు కేసుల్లో 3.30 కేజీల గంజాయిని పట్టుకున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ ఎక్సైజ్ పోలీస్ పరిధిలోని వేల్పూర్ వద్ద ఒక యువకుడు 210 గ్రాముల గంజాయితో పట్టుబడ్డాడు. నిందితుడిని గంజాయి ఎక్కడి నుంచి తీసుకు వచ్చావని అడిగితే ఆదిలాబాద్ జిల్లా భైంసాకు చెందిన ముజాయిద్‌ఖాన్ అనే వ్యక్తి నుంచి తీసుకు వచ్చినట్లు సమాచారం ఇచ్చాడు. ఈ సమాచారంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ మెంట్ సీఐలు స్వప్న, వెంకటేశ్ సిబ్బందితో కలిసి పట్టుబడిన నిందితుడితో రెండు కిలోల గంజాయిని ఆర్డర్ చేయించారు. భైంసా నుంచి ముజాయిద్‌ఖాన్‌బెక్‌పై గంజాయిని తీసుకొచ్చాడు. ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులను చూసి బెక్‌ను అక్కడే వదిలేసి అడవిలోకి పారిపోయాడు. బెక్‌లో ఉన్న గంజాయిని తూకం వేయగా 2.10కిలో గంజాయిగా ఉంది. ఈ కేసులో ఇద్దరిపై కేసు నమోదు చేయగా ఒక నిందితుడు పారిపోగా మరో నిందితుడు రిశ్వంత్‌ను అరెస్టు చేశారు. నిజామాబాద్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో మరో కేసులో కిలో గంజాయిని ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు పట్టుకున్నారు. మొత్తం ముగ్గురిపై కేసు నమోదు చేశారు. నిందితుల నుంచి బెక్లులు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు గంజాయి కేసుల్లో సీఐలతోపాటు ఎస్సై నర్సింహచారి, ఉత్తమ్, భోజన్న, రాంబచన్ అశన్న, హమీద్, విష్ణు, అవినాశ్, మంజుల, సుకన్యలను, సిబ్బందిని డిప్యూటి కమిషనర్ సోమిరెడ్డి అభినందించారు.

వ్యవసాయాధికారుల సలహాలు తీసుకోవాలి

గాంధారి(ఎల్లారెడ్డి) : రైతులు సాగు చేసిన పంటల సస్యరక్షణ కోసం వ్యవసాయాధికారుల సలహాలు తీసుకోవాలని సస్యరక్షణ కేంద్రం శాస్త్రవేత్తలు అన్నారు. మంగళవారం సస్యరక్షణ కేంద్రం కీటక విభాగం శాస్త్రవేత్తలు డా. రవిశంకర్, డా. నీలా రాణి ఏవో నరేష్‌తో కలిసి మండల పరిదిలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఖరీఫ్‌లో సాగు చేసిన సోయాబీన్, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. విత్తే ముందు విత్తనాలను శుద్ధి చేసుకుంటే పంటలను ఆశించే పలురకాల తెగుళ్లను అరికట్టవచ్చని సూచించారు.

వైద్యులకు సన్మానం

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్స్ డేను పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొప్పుల నర్సారెడ్డి, వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్ రెడ్డి, ప్రతినిధులు గాదారి గంగారెడ్డి, కమలాకర్ రావు తదితరులున్నారు.